సాక్షి
కామారెడ్డి
శనివారం ¦ 20 ¦ సెప్టెంబర్ ¦ 2025



ఎకరానికి రూ. లక్ష ఇవ్వాలి

పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున పరిహారమివ్వాలని మాజీ ఎమ్మెల్యే సురేందర్ డిమాండ్ చేశారు.

- IIలో ▸



నత్రజని వాడకాన్ని ఆపాలి

ఎండాకు తెగులు సోకిన వరికి నత్రజని వాడకాన్ని తాత్కాలికంగా ఆపాలని బాన్సువాడ ఏడీఏ అరుణ సూచించారు.

- IIIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.8 /22.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

స్త్రీనిధి రాష్ట్ర బోర్డు కోశాధికారికి సన్మానం



కామారెడ్డి టౌన్: స్త్రీనిధి రాష్ట్ర బోర్డు కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బీబీపేట మండల సమాఖ్య అధ్యక్షురాలు సదాల స్రవంతి శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పుష్పరాణి, అడిషనల్ డీఆర్డీవో విజయలక్ష్మి, స్త్రీ నిధి ఆర్‌ఎం కిరణ్ పాల్గొన్నారు.

దూరవిద్యలో ప్రవేశాల గడువు పొడిగింపు

కామారెడ్డి అర్బన్: ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించారు. ఆసక్తిగల వారు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని స్టడీ సెంటర్‌లోగాని, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 94403 56276, 91823 04067 నంబర్లలోగాని సంప్రదించాలని సెంటర్ కోఆర్డినేటర్ ఓ ప్రకటనలో సూచించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 11 మందికి జైలు

కామారెడ్డి క్రైం : మద్యం సేవించి వాహనాలు నడిపినందుకుగాను జిల్లాలో శుక్రవారం ఒకేరోజు 33 మందికి శిక్షలు పడ్డాయని ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని కోర్టులలో ప్రవేశపెట్టామని.. ఇందులో 11 మందికి ఒకరోజు జైలు శిక్ష, రూ. వెయ్యి చొప్పున జరిమానా, మరో 22 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానాలు విధించారని పేర్కొన్నారు. కామారెడ్డి పీఎస్ పరిధిలో ముగ్గురికి, ఎల్లారెడ్డి పీఎస్ పరిధిలో ఆరుగురికి, గాంధారి పీఎస్ పరిధిలో ఇద్దరికి జైలు శిక్ష పడిందని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.

దోమకొండలో ఇద్దరికి డెంగీ

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు మహిళలకు డెంగీ సోకింది. శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం వారిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు, మరొకరిని నిజామాబాద్ ఆస్పత్రికి పంపించారు. బాధితులు ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందినవారు. కాగా గ్రామంలో పారిశుద్ధ్య లోపంతో వారం పది రోజులుగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నది నిండా సమస్యలే!

- నిజాంసాగర్‌లో మంజీర కలిసే చోట పేరుకుపోయిన పూడిక
- నదికి ఇరువైపులా ఆక్రమణలు
- ప్రవాహాన్ని అడ్డుకుంటున్న చెట్లు
- సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం
- 'సాక్షి'తో నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్





వెంకంపల్లి శివారులో మంజీర నీటితో ముంపునకు గురైన పంటలు

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ''మంజీర నది నిజాంసాగర్ ప్రాజెక్టులో కలిసే చోట పూడిక భారీగా పెరిగిపోయింది. అలాగే చెట్లు కూడా పెరిగాయి. దీనికి తోడు మంజీర నది చాలాచోట్ల ఆక్రమణలతో కుచించుకుపోయింది. ఫలితంగా నది ప్రవాహం ఎక్కువగా ఉన్నపుడు నీరంతా వెనక్కి తన్నుకువచ్చి పంటలు నీట మునుగుతున్నాయి'' అని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లాలో విస్తారంగా ప్రవహించే మంజీర నది మూలంగా ఏటా వేలాది ఎకరాల పంటలు నీట మునిగి దెబ్బతింటున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్న విషయమై 'సాక్షి' నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ టి.శ్రీనివాస్‌తో ముచ్చటించింది. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

చెట్లు అడ్డు తగిలి..

నిజాంసాగర్ ప్రాజెక్టులో మంజీర నది కలిసే చోట పూడిక భారీగా పేరుకుపోయింది. దానికి తోడు చెట్లు పెరిగిపోయాయి. దీంతో వరద వేగంగా వచ్చినపుడు పూడిక, చెట్ల అడ్డుతగిలి నీరు వెనక్కి వస్తోంది. ఇదే సమయంలో మంజీర నది చాలాచోట్ల ఆక్రమణలకు గురైంది. 4 వందల మీటర్లు ఉండాల్సిన నది కొన్నిచోట్ల వంద మీటర్లకు తగ్గింది. దీంతో వరద నీరు వెనక్కి తన్నినపుడు నది వెడల్పు, లోతు సరిపోక నీరు ఇరువైపులా విస్తారంగా పారి పొలాలు నీట మునిగిపోతున్నాయి. సమస్య పరిష్కారం కోసం మంజీర నది ప్రాజెక్టులో కలిసే చోట పెరిగిన చెట్లను, పూడికను తొలగించడానికి 2023 సంవత్సరంలో రూ. 1.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.

50 వేల క్యూసెక్కులు దాటితే..

నిజాంసాగర్ ప్రాజెక్టు నిండా నీళ్లుండి 40 వేల క్యూసెక్కుల దాకా ఇన్‌ఫ్లో ఉన్నా సమస్య రావడం లేదు. 50 వేల క్యూసెక్కులకు పైగా నీరు వచ్చినపుడే ముంపు సమస్య ఏర్పడుతుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. 1,400 అడుగులతో 16 టీఎంసీలు నిల్వ ఉంచినప్పటికీ వరద ఎక్కువగా రావడంతో నీరు వెనక్కి తన్నుతోంది. భారీగా వరదలు రావడం వల్లే ఇలా జరుగుతోంది.



కొట్టుకుపోయిన పోచారం ప్రాజెక్టు కట్ట(ఫైల్)

పోచారం ప్రాజెక్టుకు..

103 ఏళ్ల చరిత్ర ఉన్న పోచారం ప్రాజెక్టు 70 వేల క్యూసెక్కుల వరదను తట్టుకుంటుంది. కానీ ఇటీవల ఒక్కసారిగా 1.82 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఇంత పెద్ద ఎత్తున వరద రావడంతో ప్రాజెక్టు కట్ట పక్కన మట్టి కొట్టుకుపోయింది. వెంటనే అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని ఇసుక బస్తాలు వేసి ప్రమాదం జరగకుండా చూశారు. శాశ్వత మరమ్మతుల కోసం 12 మీటర్ల లోతు నుంచి వాల్ నిర్మించాల్సి ఉంది.

డ్యామ్ సేఫ్టీ యాక్ట్ కింద సంబంధిత అధికారులు వచ్చి విచారణ జరిపి వారిచ్చిన డిజైన్ ప్రకారం నిర్మాణం చేపడతాం. తాత్కాలిక మరమ్మతులు చేశాం. పూర్తి స్థాయి మరమ్మతులకోసం రూ.42 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.



కొట్టుకుపోయిన కల్యాణి ప్రాజెక్టు కట్ట(ఫైల్)

ప్రాజెక్టులో పూడికతీతకు ప్రతిపాదనలు

నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29 టీఎంసీలు. అయితే అది 17.8 టీఎంసీలకు పడిపోయింది. దీనికి కారణం పూడిక పేరుకుపోవడమే.. లక్షల క్యూసెక్కుల నిల్వ సామర్థ్యం మేర ఇసుక, మట్టి నిండిపోయింది. నేషనల్ పాలసీలో భాగంగా ప్రాజెక్టుల్లో నుంచి పూడిక తీయాలని గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదించాం. అనుమతులు లభిస్తే టెండర్లు నిర్వహిస్తాం. పూడిక తీస్తే ప్రాజెక్టుకు పూర్వ వైభవం సమకూరడంతో పాటు ముంపు సమస్య తీరుతుంది.

కామారెడ్డి పెద్దచెరువుదీ అదే పరిస్థితి..

128 ఏండ్ల చరిత్ర ఉన్న కామారెడ్డి పెద్ద చెరువు పటిష్ఠంగానే ఉంది. అయితే చెరువులోకి ఇటీవల భారీ వరద వచ్చింది. 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తట్టుకునే చెరువులోకి 16,200 క్యూసెక్కుల వరద వచ్చింది. వచ్చింది వచ్చినట్టే బయటకు వెళ్లింది. అయితే 60 మీటర్ల నుంచి 80 మీటర్ల వెడల్పు ఉండాల్సిన వాగు చాలాచోట్ల ఆక్రమణలతో 20 మీటర్ల నుంచి 30 మీటర్లకు కుచించుకుపోయింది. దానికి తోడు వాగులో వ్యర్థాలను నింపడంతో లోతు కూడా తగ్గిపోయింది. దీంతో భారీ వరద వచ్చినపుడు నీరు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. వాగు దాదాపు 14 కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా వాగును క్లియర్ చేస్తాం.

సింగూరు, కల్యాణీలకూ..

కల్యాణి ప్రాజెక్టు 18 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోను తట్టుకుంటుంది. కానీ 40 వేల క్యూసెక్కుల వరద రావడంతో కట్ట కొట్టుకుపోయింది. కట్ట నిర్మించేందుకు కోటి రూపాయలతో ప్రతిపాదనలు పంపించాం. అలాగే సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ నిర్మించాల్సి ఉంది. దీనికి రూ.1.70 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

విద్యా ప్రమాణాలు పెంచాలి



బోధన సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- జిల్లాను ఉన్నత స్థాయిలో నిలపాలి
- టీఎల్‌ఎం మేళాలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని, విద్యారంగంలో జిల్లాను ఉన్నత స్థాయిలో నిలపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో నిర్వహించిన ఎఫ్‌ఎల్‌ఎన్ బోధన అభ్యసన సామగ్రి మేళా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేళాను ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచి బలమైన పునాది వేస్తేనే ఉన్నత విద్యలో రాణించగలుగుతారన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించేందుకు బోధన సామగ్రిని వినియోగించాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధన అభ్యసన సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు వేణుగోపాల్, నాగవేందర్, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి..

సుప్రీం కోర్టు ఆదేశాలు, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం భవిష్యత్‌లో ఇసుక తవ్వకాల అనుమతులు ఇవ్వడానికి జిల్లా స్థాయి కమిటీ (డీఎస్‌ఆర్) నివేదిక తప్పనిసరని కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రెవెన్యూ, గనులు, భూగర్భశాస్త్రం, భూగర్భ జలాలు, అటవీ, నీటి పారుదల, కాలుష్య నియంత్రణ మండలి, ప్రణాళిక విభాగాల అధికారులు డీఎస్‌ఆర్ కమిటీ సభ్యులుగా ఉంటారన్నారు. జిల్లాలోని గనుల కార్యకలాపాలు, లీజులు, ఆదాయం, ఇసుక ఉత్పత్తి, వర్షపాతం, భౌగోళిక పరిస్థితులు, అటవీ ప్రాంతాలు, నదులు, వాగులు, ఇసుక లభ్యతలాంటి వివరాలు డీఎస్‌ఆర్‌లో పొందుపరుస్తామన్నారు. మూడు రోజుల్లోగా జిల్లాకు సంబంధించి అందుబాటులో ఉన్న వనరుల లభ్యతపై సర్వే పూర్తి చేసి నెలాఖరులోగా ముసాయిదా నివేదికను సిద్ధం చేయాలన్నారు. అక్టోబర్ మొదటి వారంలో ముసాయిదాను ప్రజాభిప్రాయం కోసం జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది నివేదికను నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. జిల్లాలో పర్యావరణ అనుమతులను వేగవంతం చేయడానికి, ఇసుక, గనుల నియంత్రిత తవ్వకాలకు ఈ చర్యలు కీలకం కానున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి మెమోలు..

పారిశుద్ధ్య కార్యక్రమాలలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ సిబ్బందికి మెమోలు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కామారెడ్డిలోని 15వ వార్డు వినాయకనగర్‌లో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను తనిఖీ చేశారు. దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీల పునరుద్ధరణ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో ధాన్యం వేలం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రంలో విత్తన తయారీకి ఉపయోగపడని 429 క్వింటాళ్ల ధాన్యానికి శుక్రవారం సంబంధిత అధికారులు వేలం పాట నిర్వహించారు. విత్తన క్షేత్రంలో నిర్వహించిన వేలం పాటలో ఏడుగురు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామానికి చెందిన సైకిలాబ్ గౌడ్ అనే వ్యక్తి క్వింటాల్‌కు రూ.1,590 చొప్పున పాడి ధాన్యాన్ని దక్కించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ఆర్‌ఎం రఘు, విత్తనక్షేత్ర ఏడీఏ ఇంద్రసేన్, ఏవో అచరిత, ఎల్లారెడ్డి ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఈవో శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

- బాధితులకు న్యాయం అందించాలి
- ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం : పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాయలంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. దొంగతనం, ఆస్తి సంబంధిత నేరాలకు సంబంధించి పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన కేసుల్లో నేరస్తులపై హిస్టరీ షీట్‌లను తెరవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డయల్ 100 కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలన్నారు. సైబర్ నేరాలపై క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలన్నారు. ఫేక్ నంబర్ ప్లేట్లు, నంబర్ ప్లేట్ల మార్పుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా డీజేలకు అనుమతులు లేవన్నారు. భక్తిశ్రద్ధలతో సంప్రదాయాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు.



హోంగార్డులకు రెయిన్ కోట్లు అందిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి..

క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జిల్లాలోని హోంగార్డ్‌లు, ఏఆర్ సిబ్బందితో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల సమయంలో ప్రతి పోలీస్ అధికారి చేసిన కృషిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారన్నారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు అందిస్తామని, తప్పు చేసేవారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రతి పోలీసు అధికారి ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం హోంగార్డులకు రెయిన్ కోట్‌లు, వులెన్ జెర్సీలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపం.. నిర్వహణ భారం..

- ఏడాదిన్నరగా అంధకారంలో పట్టణం
- పుర వీధులతోపాటు ప్రధాన రోడ్లపైనా చీకట్లు
- నిధులు లేకపోవడమే కారణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



జిల్లా కేంద్రంలోని సిరిసిల్లరోడ్‌లో వెలగని సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సూర్యుడు అస్తమించగానే పట్టణంలోని చాలా కాలనీలతో పాటు ప్రధాన రోడ్లపైనా అంధకారం నెలకొంటోంది. అక్కడక్కడ కొన్ని లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి. బడ్జెట్ కొరతతో బల్దియాలకు వీధి దీపాల నిర్వహణ భారంగా మారింది. నూతన బల్బులు కొనుగోలు చేసే పరిస్థితులు లేకపోవడంతో చెడిపోయిన వాటి స్థానంలో నూతన బల్బులను బిగించడం లేదు. చేతులెత్తేశారు. దీంతో ఏడాదిన్నరగా పట్టణంలోని దారులన్నీ చీకట్లలో ఉంటున్నాయి.

రూ. 8కోట్లకుపైగా బకాయిలు

బల్దియాలో వీధి దీపాలను అమర్చడం, నిర్వహణ ఈఈఎస్‌ఎల్ అనే సంస్థ ఆధ్వర్యంలో కొనసాగింది. ఐదేళ్లపాటు నిర్వహణ, పర్యవేక్షణ బాగానే సాగింది. ఏడాది క్రితం కాంట్రాక్ట్ గడువు ముగిసింది. ఈ సంస్థకు రూ. 8 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. బడ్జెట్ లేకపోవడంతో అధికారులు సైతం నూతన బల్బులను కొనుగోలు చేయడం లేదు.

ఇదీ పరిస్థితి..

కామారెడ్డి బల్దియాలో 49 వార్డులో 300ల పరిధిలో 12,434 వీధి దీపాలున్నాయి. టేక్రియాల్ బైపాస్ నుంచి కొత్తబస్టాండ్ మీదుగా హౌసింగ్‌బోర్డు వరకు, నిజాంసాగర్ చౌరస్తా నుంచి దేవునిపల్లి వరకు, నిజాంసాగర్ చౌరస్తా నుంచి రైల్వేబ్రిడ్జి, స్టేషన్‌రోడ్ మీదుగా పాతబస్టాండ్, సిరిసిల్లరోడ్ బైపాస్ వరకు డివైడర్‌ల మధ్య సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలో 450కిపైగా లైట్లు ఉన్నాయి. ప్రధానంగా సెంట్రల్ డివైడర్‌ల మధ్య 70 శాతం వరకు లైట్లు వెలగడం లేదు. కాలనీల్లోనూ చాలా వరకు లైట్లు పాడయ్యాయి. పలు కాలనీలలో మాజీ కౌన్సిలర్లు తమ సొంత డబ్బులతో వీధి దీపాలను అమర్చుతున్నారు.



కొత్తబస్టాండ్ ప్రాంతంలో..



డీఎస్పీ కార్యాలయం సమీపంలో..



రైల్వే బ్రిడ్జి మీద..

సమస్య పరిష్కారం అవుతుంది



నిధులు లేకపోవడంతో పట్టణంలో వీధి దీపాల నిర్వహణ సమస్య ఉంది. అత్యవసరం ఉన్న చోట బల్బులను బిగిస్తున్నాం. వీధి దీపాల నిర్వహణపై ఇటీవల సీఎం సమక్షంలో సమావేశం జరిగింది. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

క్లుప్తంగా

హిందీ దివస్ పాటల సీడీ ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా అధ్యక్షుడు, హిందీ పండిట్ సిరిసిల్ల గఫూర్ శిక్షక్ రచించి రూపొందించిన హిందీ దివస్ పాటల సీడీని డీఈవో రాజు శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. హిందీ గీతాలను గాయకురాలు సుధ పాడగా, సంగీత దర్శకులు అష్ట గంగాధర్ సంగీతం అందించారు. యూట్యూబ్‌లో గఫూర్ శిక్షక్ సాంగ్స్‌లో వినవచ్చన్నారు. జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ఆదినారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలతో మాజీ ఎమ్మెల్యే భేటీ



నిజాంసాగర్(జుక్కల్): జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్రాను శుక్రవారం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరద నీటి ప్రవాహాల కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనావేసి రైతులకు నష్ట పరిహారం అందేలా చూడాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. వర్షాలకు కూలిన ఇళ్ల బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు సింధే తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు చీరల పంపిణీ



కామారెడ్డి టౌన్: బతుకమ్మ, దసరా పండుగల కానుకగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ట్రాన్స్‌జెండర్‌లకు శుక్రవారం తన నివాసంలో చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పంపరి శ్రీనివాస్, జూలూరి సుధాకర్, చాట్ల వంశీ, ప్రసాద్, మామిడ్ల రమేష్, రంగా రమేష్ గౌడ్, బల్ల శ్రీనివాస్, కిరణ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న సీజనల్ వ్యాధులు

- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరపీడితులు
- గ్రామాలలో కొనసాగుతున్న వైద్య శిబిరాలు
- భయపెడుతున్న డెంగీ, మలేరియా
- పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



రాజంపేట వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

రాజంపేట: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల ప్రభావం భారీగా ఉండే అవకాశం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల్లో జ్వర బాధితుల సంఖ్య పెరిగింది. అపరిశుభ్రంగా ఉంటే జ్వరంతోపాటు డెంగీ, మలేరియా వంటి వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జనాల్లో అవగాహన కల్పించడంతోపాటు గ్రామ పంచాయతీ సిబ్బంది దోమలను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకపోలేదని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం..

దోమల కారణంగా మలేరియా, డెంగీ వ్యాధులు పెరుగుతుంటాయి. వీటి బారిన పడకుండా దోమల నియంత్రణకు పరిసరాల పరిశుభ్రత పాటించడానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంట్లో దుమ్ము ధూళి, పాత సామగ్రిని శుభ్రం చేయాలి. ఇంటి చుట్టూ పూల కుండీలు, కూలర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఎక్కడపడితే అక్కడి నీరు తాగడం మంచిది కాదు. బయట ఆహారానికి దూరంగా ఉండడమే మేలు. కాచి చల్లార్చి వడ బోసిన నీటిని తాగడం మంచిది. మూడు రోజుల కంటే జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, ఇతర సమస్యలు వేధిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

దోమ తెరలు వాడాలి



వర్షాల కారణంగా నీటి నిల్వలతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. కానీ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి. ఇళ్లలో దోమ తెరలు వాడాలి.

– విజయ మహాలక్ష్మి, వైద్యులు, రాజంపేట

ఎకరానికి రూ.లక్ష పరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, పక్కన బీఆర్‌ఎస్ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వరదల్లో పంట నష్టం జరిగిన రైతులకు ఎకరానికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. వరదలు వచ్చిన పది రోజులకు కామారెడ్డి పర్యటకు వచ్చిన సీఎం రైతులకు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు. కేవలం ఫోటో ఎగ్జిబిషన్ చూసి వెళ్లారని మండిపడ్డారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన నష్టం కంటే ఎక్కువగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఈ ఏడు మండలాల్లో సారవంతమైన భూముల్లో సాగు చేసిన పంటలు వరద ఉధృతికి కొట్టుకుపోవడమే కాకుండా చాలా చోట్ల పంటపై ఇసుక మేటలు వేయడంతో తీవ్రమైన నష్టం జరిగిందన్నారు. ఏడు మండలాల్లో సుమారుగా 20 వేల ఎకరాలకు పైగా పంట జరిగి ఉంటుందని, కానీ అధికారులు మాత్రం జిల్లా వ్యాప్తంగా 23 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని లెక్కలు చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు కమిలి నర్సింలు, పడిగెల రాజేశ్వర్ రావు, విండో చైర్మన్ కమలాకర్ రావు, జిల్లా మాజీ కో–ఆప్షన్ మోహినొద్దిన్, నాయకులు గడీల భాస్కర్, శ్రీనివాస్ నాయక్, అల్తాఫ్ పాల్గొన్నారు.

నాగులమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

సదాశివనగర్/ఎల్లారెడ్డిరూరల్/గాంధారి: మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించిన నాగులమ్మ గుడిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గుడి నిర్మాణం కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్‌లో, గాంధారిలో పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మేరా యువ భారత్


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం మేరా యువభారత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన సంక్షేమ పథకాలపై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామీణ నేపథ్యం ఉన్న ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి భారత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటి గురించి విద్యార్థులు సమగ్రంగా తెలుసుకుని గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్య పర్చాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ..ప్రజలకు పథకాల గురించి అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది పేదలు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని అన్నారు. కెనరా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ.. ఖాతాదారులు తమ సిబిల్ స్కోర్ పడిపోకుండా చూసుకోవాలని, రుణాలకోసం ప్రాజెక్టు రిపోర్టుతో వస్తే బ్యాంకులు కచ్చితంగా మంజూరు చేస్తాయన్నారు. డీట్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కళాశాల అధ్యాపకులు భగవాన్‌రెడ్డి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వినయ్‌కుమార్, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ కృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్లు శ్రీనివాస్, రాజేష్, ఎంపీడీవో ఆనంద్ పాల్గొన్నారు.

మహిళలకు కొనసాగుతున్న ప్రత్యేక వైద్య శిబిరాలు


దేవునిపల్లి పీహెచ్‌సీలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కూడా వైద్య శిబిరాలు ఏర్పాటు మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమున్న వారిని పెద్దాసుపత్రులకు సిఫారసు చేశారు. మహిళలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. కామారెడ్డి మండలం దేవునిపల్లి పీహెచ్‌సీ, దోంగ్లీ పీహెచ్‌సీ, బాన్సువాడ మండలం హన్మాజీపేట పీహెచ్‌సీ, భిక్కనూరు మండలం జంగంపల్లిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

– కామారెడ్డి రూరల్/మద్నూర్/బాన్సువాడ రూరల్/భిక్కనూరు

వ్యసనాలకు బానిసలు కావొద్దు



తాడ్వాయి/లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థి దశలో వ్యసనాలకు బానిసలు కావొద్దని మోటివేషన్ స్పీకర్ బండారు సంజీవులు సూచించారు. శుక్రవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో, తాడ్వాయి మండలం నందివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలను వాడడం వల్ల ఎదుర య్యే పరిణామాల గురించి వివరించారు. మాదకద్ర వ్యాల నిర్మూలనకు ప్రతీ విద్యార్థి కృషి చేయాలన్నారు.

హోంనీడ్స్ ఉత్పత్తుల విక్రయశాల ప్రారంభం


విక్రయశాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ విజయ్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగం హోంనీడ్స్ ఉత్పత్తులకు పేటెంట్ హక్కులు పొందే విధంగా తయారు కావాలని ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో హోంనీడ్ కెమికల్స్ విక్రయశాలను ఆయన ప్రారంభించారు. గృహాల్లో శుభ్రతకు వినియోగించే ఉత్పత్తులను అధ్యాపకులు కొనుగోలు చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, కెమిస్ట్రీ విభాగం అధిపతి జి.మానస, సమన్వయకర్త విశ్వప్రసాద్, జయప్రకాష్, అధ్యాపకులు రాజశ్రీ, శారద, శ్రీనివాస్, శ్రీలత, శ్రీనివాస్‌రావు, దినకర్, రాజ్‌గంభీర్‌రావు, గణేష్ పాల్గొన్నారు.

సమాచారం..

22న సబ్ జూనియర్స్ కబడ్డీ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు కామారెడ్డి సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ మైదానంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా 55 కిలోల లోపు బరువు కల్గి, 30 నవంబర్ 2009 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి 29 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి 35వ సబ్‌జూనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 93985 71110 నంబర్‌కు సంప్రదించవచన్నారు.

రేపు పిత్రు, శనిదోషాల నివారణకు విశేష పూజలు

కామారెడ్డి అర్బన్: పెద్దల అమావాస్య, ఆదివారం కలిసి వస్తున్నందున పిత్రు దోషాల నివారణకు శ్రీశని శంగనాపురం శనేశ్వరస్వామికి విశేష పూజలు, తైలాభిషేకం నిర్వహించనున్నట్లు కామారెడ్డి శ్రీ జయదుర్గ వైద్యనాథేశ్వర, శనేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు, వేదపండితులు జి.అంజనేయశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పిత్రు, శనిదోషాల నివారణకై ఈ అవకాశం వినియోగించుకోవాలని వారు కోరారు.

26న ఆర్‌బీవీఆర్‌ఆర్ ట్రస్టు సర్వసభ్య సమావేశం

కామారెడ్డి అర్బన్: రాజా బహదూర్ వెంకటరాంరెడ్డి (ఆర్‌బీవీఆర్‌ఆర్) ట్రస్టు సర్వసభ్య సమావేశం ఈనెల 26న దేవునిపల్లి లక్ష్మీదేవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు ట్రస్టు జిల్లా అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై చర్చించారు. ట్రస్టు శాశ్వత సభ్యులందరు సర్వసభ్య సమావేశానికి హాజరై భవన నిర్మాణ విషయమై సలహాలు ఇవ్వాలని జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి కోరారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్‌రెడ్డి, ప్రతినిధులు కుంట సంతోష్‌రెడ్డి, కొలిమి భీంరెడ్డి, ఆయా మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా రాష్ట్ర పోటీలకు సాత్విక్



కామారెడ్డి అర్బన్: సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి పోటీలకు చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సాత్విక్ ఎంపికైనట్లు హెచ్‌ఎం సాయి రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివరాజ్ తెలిపారు. నిజామాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సెపక్‌తక్రా ఎంపికల్లో పాల్గొన్న సాత్విక్ ప్రతిభ చూపడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని, ఈనెల 20, 21, 22 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

టీఎల్‌ఎం మేళాలో అయిలాపూర్ టీచర్‌కు ద్వితీయ స్థానం



లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు పద్మ జిల్లా స్థాయిలో ప్రదర్శించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం).. జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు మండల విద్యాధికారి షౌకత్‌అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయురాలు ప్రదర్శించిన అక్షర బాలశిక్ష బోధన అభ్యాసనం సులభతరమై విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనకు ద్వితీయ స్థానం లభించినట్లు తెలిపారు. అలాగే ఆ ఉపాధ్యాయురాలు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయురాలిని డీఈవో రాజు, ఎంఈవో షౌకత్‌అలీ, హెచ్‌ఎం దామోదర్ అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

స్కూల్‌తండాలో గంజాయి మొక్కలు సీజ్



రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండలంలోని స్కూల్‌తండాలో గంజాయి సాగు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై లావణ్య సిబ్బందితో కలిసి శుక్రవా రం దాడులు నిర్వహించారు. తండాకు చెందిన గంగావత్ రాజేందర్ తన ఇంటి పెరట్లో అక్రమంగా 25 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అనంతరం గంజాయి మొక్కలను తొలగించి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే నిందితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను సైతం సీజ్ చేశామన్నారు. నిందితుడు విచారణలో తాను వ్యక్తిగత వినియోగం, అమ్మకాల కోసం గంజాయి సాగు చేస్తున్నట్లు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని గంజ్ మార్కెట్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈనెల 16న నగరంలోని గంజ్ మార్కెట్‌లోని కూరగాయల షాపు వద్ద గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవని పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 55–60ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఒంటిపై బూడిద రంగు బనియన్, క్రీమ్ కలర్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసినచో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712659714ను సంప్రదించాలన్నారు.

నగరంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గుర్తుపట్టలేని స్థితిలో వ్యక్తి మృతదేహం లభించిందని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఈ వయస్సు ఉన్న వారు ఎవరైనా తప్పిపోయినచో ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712659837, 8712659714కు సమాచారం అందించాలన్నారు.

నవీపేట్ మండలంలో..

నవీపేట: మండలంలోని నాగేపూర్ శివారులో శుక్రవారం ఉదయం ప్లాస్టిక్ సంచిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవన్నారు. మృతుడి వయస్సు సుమారు 30–40 ఏళ్లలోపు ఉంటుందన్నారు. దుండగులు హత్య చేసి ప్లాస్టిక్ సంచిలో మూట కట్టినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహం పూర్తిగా కూలిపోయి ఉందని, మృతదేహంపై నలుపు రంగు ప్యాంటు, ఎరుపు రంగు టీషర్టు ఉందన్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

న్యాయం చేయాలంటూ పురుగుల మందు డబ్బాతో ఆందోళన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ మాజీ కౌన్సిలర్ ఇంటి ముందు శుక్రవారం బాధితుడు మహదేవ్ న్యాయం చేయాలంటూ పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేశారు. బాధితుడు మాట్లాడుతూ.. పాల్వంచ మండలం భవానిపేట గ్రామంలోని సర్వేనెంబర్ 769/186లో ఐదు ఎకరాల 10 గుంటల భూమిని మాజీ కౌన్సిలర్ భర్త వద్ద రూ. 70లక్షలకు కొనుగోలు చేయగా, సేల్ డీడీ చేసి ఇచ్చారన్నారు. కానీ తన పేరుపైన పాస్ పుస్తకం చేసి ఇస్తానని చెప్పి రెండు సంవత్సరాలు అవుతుందని, అడిగితే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

ఖలీల్‌వాడి: గుడుంబా తయారీకి ఉపయోగించే నిషేధిత నల్లబెల్లం, పటికను పట్టుకున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. ఆపరేషన్ సత్కార్ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి నాందేడ్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న రైలులో రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో 2వేల కిలోల నల్లబెల్లం, 200 కిలోల పటికను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నల్ల బెల్లం విలువ రూ. 8లక్షలు, 200కిలోల పట్టిక రూ. 40 వేలు ఉంటుందన్నారు. పట్టుకున్న నల్ల బెల్లం, పటికను నిజామాబాద్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించామన్నారు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి, ఎక్సైజ్ అధికారులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


మహమ్మద్ నగర్‌లో నీటిట్యాంకులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారిణి అరుణ


కృష్ణాజీవాడిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సాజిద్ అలీ


దోమకొండలో.. మండల ప్రత్యేకాధికారి జ్యోతి

సాక్షి నెట్‌వర్క్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. శుక్రవారం మహమ్మద్‌నగర్, తాడ్వాయి, రాజంపేట, దోమకొండ మండలాల పరిధిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిలువ ఉన్న నీటిని పారబోశారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ట్యాంకుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులకు కారణం అవుతాయన్నారు.

పెన్షన్ డబ్బు చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

- రూ.8 లక్షలు రికవరీ
- నిందితుల్లో ఒకరు తపాలాశాఖ ఉద్యోగి

ఖలీల్‌వాడి: మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో ఇటీవల బ్రాంచ్ పోస్టు మాస్టర్ నరేందర్ వద్ద నుంచి పెన్షన్ డబ్బులు ఎత్తుకెళ్లిన ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 30న పోస్టు మాస్టర్ నరేందర్ పెన్షన్ పంపిణీ కోసం రూ. 8లక్షలు ఇంటికి తీసుకురాగా, గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మాక్లూర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. టెక్నికల్ సాక్ష్యాలు ఆధారంగా నిందితులను గుర్తించి, విశ్వసనీయ సమాచారం మేరకు నవీపేట్ మండలంలోని నాగేపూర్‌కు చెందిన కొండమొల్ల రాకేష్(19), అదే గ్రామానికి చెందిన అసిస్టెంట్ పోస్టుమాస్టర్ పత్తి సాయికుమార్(23)ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చామన్నారు. రూ.7.68లక్షలను పత్తి సాయికుమార్ ఇంటి నుంచి, రూ.32 వేలు కొండమొల్ల రాకేష్ ఇంటి నుంచి రికవరీ చేశామన్నారు. అలాగే వారి మోటార్ సైకిల్, ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సాయికుమార్ మూడు సంవత్సరాలుగా ముబారక్ నగర్ బ్రాంచ్ పోస్టు ఆఫీస్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తన ఉద్యోగ రీత్యా ప్రతి పోస్టు ఆఫీస్‌కి సంబంధించిన పెన్షన్ డబ్బులు ఎప్పుడు తీసుకొనివస్తారు, వాటిని ఎక్కడ ఉంచుతారనే సమాచారం తెలుస్తుంది. ఈక్రమంలో సాయికుమార్‌కు పెన్షన్ డబ్బులు కాజేయాలనే ఆలోచన కలిగింది. తన దగ్గరి స్నేహితుడు, అదే గ్రామానికి చెందిన రాకేష్‌కు ఈ పథకం వివరించి, గత నెల 29న మామిడిపల్లి గ్రామానికి వెళ్లారు. పథకం ప్రకారం రాకేష్‌ను గుర్తు తెలియని వ్యక్తిగా నరేంద్ర ఇంట్లో ఆశ్రయం పొందేలా చేశాడు. రాత్రి అందరూ నిద్ర పోయిన తర్వాత, రాకేష్ అక్కడి నుంచి పెన్షన్ డబ్బుల బ్యాగ్‌ను దొంగిలించి, సాయికుమార్ వద్దకు తీసుకెళ్లాడు. మాక్లూర్ పోలీసులు సమయోచితంగా చర్యలు తీసుకోవడంతో మొత్తం నగదు తిరిగి రికవరీ చేసినట్లు తెలిపారు. కేసును చేధించిన నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజశేఖర్, సిబ్బంది రాజేశ్వర్, రాజారెడ్డి, రాకేష్, దత్తాద్రి గౌడ్, రాజు, చరణ్, ఐటీ కోర్ సిబ్బంది సాగర్, సందీప్‌ను అభినందించారు.

ఇసుక ట్రాలీ ఆటోల పట్టివేత

బోధన్: సాలూర మండలంలోని మందర్నా, హన్నా, ఖాజాపూర్ గ్రామాల నుంచి బోధన్ వైపు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ట్రాలీ ఆటోలను రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాలీ ఆటోలను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణాకు పాల్పడితే చట్టబద్ధ చర్యలుంటాయని తహసీల్దార్ శశిభూషణ్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడ్డంకులను తొలగించాలి




భిక్కనూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏవేని అడ్డంకులు ఉన్నా వాటిని తొలగించాలని భిక్కనూరు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన ఎంపీడీవో రాజ్‌గంగారెడ్డితో కలిసి మాట్లాడారు. ఇసుకకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.

శబరిమాత ఆశ్రమ అభివృద్ధికి సహకరించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమ అభివృద్ధికి భక్తులు సహకరించాలని ఆలయ ట్రస్టు కమిటీ అధ్యక్షుడు అనంతరావు అన్నారు. శుక్రవారం ఆశ్రమంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఆశ్రమ అభివృద్ధి, నిత్యాన్నదానం, నిత్య పూజా కార్యక్రమాలకు భక్తులు తమవంతు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, సభ్యులు కృష్ణమూర్తి, శ్రీనివాస్, బాలకిషన్, రాఘవరెడ్డి, నర్సిములు, రనీల్‌రెడ్డి, రమశంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అలవర్చుకోవాలి



బాన్సువాడ రూరల్: మహిళలు ఆరోగ్యకరమైన ఆహా ర అలవాట్లను అలవర్చుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ బాన్సువాడ సీడీపీవో సౌభాగ్య అన్నారు. శుక్రవారం బోర్లం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషకాహార వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, వృద్ధులకు సరైన పోషకాహారం అవసరమన్నారు. పౌష్టికాహార వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. జీపీ కార్యదర్శి సాయికుమార్, ఏఎన్‌ఎం శోభ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, కిషోరబాలికలు పాల్గొన్నారు.